
సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025


కనకం.. ఇక కొనలేం..



పసిడి ధర పరుగు పెడుతోంది. సామాన్యులు కొనలేనట్లుగా దూసుకుపోతుంది. తొలిసారిగా తులం బంగారం రూ.లక్ష మార్కు దాటేసింది.

10లో▸

తీర్మానాలపై తిరకాసు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బల్దియా అధికారులకు తలనొప్పిగా మారింది. అర్హుల వివరాలతో కూడిన తీర్మానాలపై కమిటీ చైర్మన్లుగా సంతకాలు చేసేందుకు పలువురు మాజీ కౌన్సిలర్లు నిరాకరిస్తున్నారు.

11లో▸

గరిష్టం/కనిష్టం
43.0/29.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



జొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జైనథ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట దిగుబడిని విక్రయించాలని సూచించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. బేల:మండలకేంద్రంలోనిసబ్‌మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోళ్లను ఎంపీనగేశ్, ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఇందులో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ నారాయణ, సభ్యులు

తాంసి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) అని చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల వినియోగదారులతో భీంపూర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి చైర్మన్‌తో పాటు సభ్యులు హాజరయ్యారు. ఎనిమిది ఫిర్యాదులు రాగా వాటిపై సంబంధిత ఏఈలను వివరణ కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వేదికకు జిల్లా అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజా గౌడ్, డీఈ హరికృష్ణ, ఏడీఏ శ్రావణ్‌కుమార్, ఏఈలు తిరుపతిరెడ్డి, మనోజ్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్మిక సంఘాల జిల్లా స్థాయి సమ్మె సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, కార్యదర్శి రాజన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమన్న, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, జిల్లా కార్యదర్శి కిరణ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాఘవులు, సునిత, రేణుక, పాల్గొన్నారు.

వినియోగదారుల సేవాకేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్: సమస్యల సత్వర పరిష్కారానికే వినియోగదారుల సేవాకేంద్రం ఏర్పాటు చేసినట్లు బీఎస్ఎన్ఎల్ ఏరియా డివిజనల్ ఇంజినీర్ శివనాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎం పి.గోపి సీతారాం, ఎస్డీఈలు, జేటీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫస్టియర్ డౌన్.. సెకండియర్ అప్

- ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో పరిస్థితి
- ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో 27వ స్థానం
- ద్వితీయ సంవత్సరంలో 12వ స్థానం
- సత్తా చాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ ఫలితాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరం ఫలితాలు పడిపోగా, ద్వితీయ సంవత్సరం కొంత మెరుగైంది. ఫస్టియర్‌లో జిల్లా రాష్ట్రస్థాయిలో 27వ స్థానంలో నిలువగా, సెకండియర్‌లో 12వ స్థానం దక్కింది. మొత్తంగా ఈ సారి బాలుర కంటే బాలికలే పైచేయిగా నిలిచారు.

ఫస్టియర్.. 9నుంచి 27వ స్థానానికి డౌన్

ఈ ఏడాది ప్రథమ సంవత్సరం ఫలితాలు గతంతో పోల్చితే దారుణంగా పడిపోయాయి. గతేడాది రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలవగా,ఈసారి ఏకంగా 27వ స్థానానికి దిగజారింది.

- జనరల్ కోర్సులో 8,093 మంది పరీక్షకు హాజరు కాగా, 4,295మంది హాజరయ్యారు. 53.07 ఉత్తీర్ణత శాతం నమోదైంది. గతేడాదితో పోల్చితే ఈసారి 8.43 శాతం ఉత్తీర్ణత తగ్గింది. ఇందులో బాలురు 4,033 మంది పరీక్షకు హాజరు కాగా, 1,658 ఉత్తీర్ణత సాధించారు. 41.11 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 4,060 మంది పరీక్షకు హాజరు కాగా, 2637 మంది పాస్ అయ్యారు. 64.95 ఉత్తీర్ణత శాతం నమోదైంది.
- ఒకేషనల్ కోర్సులో 1013 మంది పరీక్షకు హాజరుకాగా, 672 మంది ఉత్తీర్ణత సాధించారు. 66.34 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 421 మంది పరీక్షకు హాజరు కాగా, 252 మంది పాసయ్యారు. 59.86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 592 మంది పరీక్షకు హాజరు కాగా, 420 మంది ఉత్తీర్ణులయ్యారు. 70.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రస్థాయిలో ఒకేషనల్ కోర్సులో జిల్లాకు 3వ స్థానం దక్కింది.

ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు ఇలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంతో పోల్చితే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించారు.

- ద్వితీయ సంవత్సరంలో తలమడుగు జూనియర్ కళాశాల విద్యార్థులు 87.88 శాతం ఉత్తీర్ణులై ప్రథమ స్థానంలో నిలిచారు. బేలలో 85 శాతం, తాంసిలో 80 శాతం, గుడిహత్నూర్‌లో 75.17 శాతం, ఇంద్రవెల్లి 71.68 శాతం, బజార్‌హత్నూర్‌లో 70.65, ఇచ్చోడలో 69.16, బోథ్‌లో 67.09 శాతం, నేరడిగొండ 64.93, ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 61.64 శాతం, నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 61.33, ఉట్నూర్ జూనియర్ కళాశాలలో 56.56 శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల 44.96 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది.
- ప్రథమ సంవత్సరం ఫలితాల పరంగా చూస్తే తలమడుగు 81.08 శాతం, తాంసి78.32శాతం, గుడిహత్నూర్ 75.61శాతం, చివరి వరుసలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల 30.65 శాతం, ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 22.52, అత్యల్పంగా ఇంద్రవెల్లి జూనియర్ కళాశాల విద్యార్థులు 18.97శాతం ఉత్తీర్ణులయ్యారు.



తలమడుగు: వందశాతం ఉత్తీర్ణత సాధించిన సాయిలింగి కేజీబీవీ విద్యార్థులు

- ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి స్నేహ 467/470 మార్కులు సాధించింది. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం చదువుతున్న జోహ సదఫ్ బైపీసీలో 988 మార్కులు సాధించింది. ఇంగ్లిష్ మీడియం బైపీసీ విద్యార్థి మసీర అన్రమ్ 977 మార్కులు, ఉర్దూ మీడియం ఎంపీసీలో మదిహ మస్రత్ 934 మార్కులు, హెచ్ఈసీ ఉర్దూ మీడియంలో మహెక్ 933 మార్కులు సాధించారు. వీరిని డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకుమార్‌లు విద్యార్థులను అభినందించారు.



తండ్రితో జోహ సదఫ్(988)



తల్లిదండ్రులతో స్నేహ(467)

సెకండియర్‌లో ఒక స్థానం మెరుగు..

ద్వితీయ సంవత్సరంలో గతేడాదితో పోల్చితే ఈసారి ఒక స్థానం మెరుగుపడింది. రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థులు 12వ స్థానంలో నిలిచారు.

- జనరల్ కోర్సులో మొత్తం 7,978 మంది పరీక్షకు హాజరు కాగా 5,550 మంది ఉత్తీర్ణులయ్యారు. 69.57 శాతం నమోదైంది. ఇందులో బాలురు 3,880 మంది పరీక్షకు హాజరు కాగా, 2376 మంది పాసయ్యారు. 61.24 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 4098 మంది పరీక్షలు రాయగా, 3174 మంది పాస్ అయ్యారు.77.45శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 13.15 శాతం ఉత్తీర్ణత పెరిగింది.
- ఒకేషనల్ కోర్సులో 912 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 741 మంది పాస్ అయ్యారు. ఉత్తీర్ణత శాతం 81.25 నమోదైంది. బాలురు 360 మందికి గాను 273 మంది పాస్ అయ్యారు. 75.83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 552 మందికి గాను 468 మంది పాస్ అయ్యారు. 84.78 ఉత్తీర్ణత శా తం నమోదైంది. గతేడాది రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో నిలవగా, ఈసారి 6 స్థానాలను మెరుగుపర్చుకొని ఐదో స్థానానికి ఎగబాకింది.



రంభ (977) కావేరి(964) అన్నపూర్ణ (963)

ఇచ్చోడ/తలమడుగు/ఇంద్రవెల్లి:ఇచ్చోడ ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని కావేరి బైపీసీలో 964 మార్కులు సాధించగా, స్నేహ ఎంపీసీలో 961 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గుల్లె సాక్షి బైపీసీలో 960 మార్కులు సాధించగా, కేజీబీవీ విద్యార్థిని ప్రియాంక ఎంపీహెచ్ డబ్ల్యూ సెకండియర్‌లో 928 మార్కులతో ప్రతి భ కనబరిచింది. గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 90 శాతం, సెకండియర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సెకండియర్‌లో వందశాతం ఉత్తీర్ణ త సాధించినట్లు ప్రిన్సిపాల్ నారాయణ పేర్కొన్నారు. తలమడుగు మండలంలోని సాయిలింగి కేజీబీవీలో సెకండియర్‌లో వందశాతం ఉత్తీ ర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అర్చన తెలిపారు. ఇంద్రవెల్లి గురుకుల కళాశాలలో బైపీసీలో కే రంభ 977 మార్కులు, జే పాయల్ 962, రాజ్యలక్ష్మి 960, ఎంపీసీలో అన్నపూర్ణ 963 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ..

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి నిర్వహించనున్నట్లు డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు ఈనెల 23 నుంచి 30 వరకు చెల్లించవచ్చని తెలిపారు. రీవెరిఫికేషన్ కోసం ప్రతీ పేపర్‌కు రూ.600 ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. రీకౌంటింగ్‌కోసం పేపర్‌కు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సెకండియర్‌లో పెరిగిన ఉత్తీర్ణత



ఈ ఏడాది ఇంటర్ సెకండియర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాం. గతంతో పోల్చి తే 13 శాతం ఉత్తీర్ణత పెరిగింది. కలెక్టర్ రాజర్షిషా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. కరదీపికలు తయారు చేయించి అందించారు. ఈ మేరకు మంచి ఫలితాలను సాధించగలిగాం. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

– జాదవ్ గణేశ్‌కుమార్, డీఐఈవో

భూ భారతితో రైతులకు మేలు

- కలెక్టర్ రాజర్షి షా

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో భూ భారతి చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రైతులకు సంబంధించి అనేక సమస్యలకు భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, బోథ్ మండల స్పెషల్ ఆఫీసర్ వాజీద్ పాల్గొన్నారు. సొనాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు రైతులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఫిర్యాదులు పక్కాగా నమోదు చేయాలి

కైలాస్‌నగర్: భూభారతి గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ రాజ ర్షి షా అన్నారు. భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల్లో నిర్వహిస్తున్న భూ భారతి అవగాహన సదస్సుల్లో రైతులు, రైతు అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. అంతకు ముందు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూ భారతి, హౌసింగ్‌శాఖ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో బి సేఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, ట్రాఫిక్ సీఐలు సునిల్ కుమార్, ప్రణయ్ కుమార్, మహిపాల్ రెడ్డి, అమూల్ ఓజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్‌లో సంస్థ ద్వారా హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్పీ చేతుల మీదుగా 30 మందికి ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు.




మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వాహనాల నిర్వహణ తప్పనిసరి

వాహనాల నిర్వహణ క్రమం తప్పకుండా చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు హెడ్ క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో పోలీసు వాహన అధికారులు, డ్రైవర్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టేషన్లలో డ్రైవర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చూడాలన్నారు. సమావేశంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఎంటీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సందీప్ సత్తా

- రెండో ప్రయత్నంలో మెరుగైన ర్యాంక్



ఆద సందీప్

ఆదిలాబాద్‌టౌన్: గమ్యం చేరే వరకు లక్ష్యాన్ని వీడడం లేదు.. సివిల్స్‌లో తొలి ప్రయత్నంలో సాధించిన ర్యాంక్‌తో సంతోషపడకుండా మరో ప్రయత్నం చేశాడు.. తాజాగా మరింత మెరుగైన ర్యాంక్ సాధించాడు.. అయినా విశ్రమించేది లేదని మరో ప్రయత్నానికి సిద్ధమవుతాన ని చెబుతున్నాడు జిల్లా కేంద్రానికి చెందిన సందీప్. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన ఆద వెంకటేశ్– వాణి దంపతులు పట్టణంలోని రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్ ఇంటెలిజెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరి కుమారుడు సందీప్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆల్‌ఇండియా స్థాయిలో 667వ ర్యాంక్ సాధించాడు. ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాడు. అయితే మొదటి ప్రయత్నంలో 830 వ ర్యాంక్ సాధించగా, ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎస్)లో ఉద్యోగంలో చేరాడు. సెలవులో ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టాడు. ఈసారి గతం కంటే మెరుగైన ర్యాంక్ సాధించాడు. అయితే ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని చెబుతున్నాడు ఇతడు. సందీప్ 5వ తరగతి వరకు ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్‌లో అభ్యసించగా, 6నుంచి 10వతరగతి వరకు కాగజ్‌నగర్ నవోదయాలో చదివాడు. హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తిచేశాడు. జేఈఈ మెయిన్స్‌లో 550వ ర్యాంక్ సాధించాడు. బిహార్‌లోని ధన్‌బాద్ ఐఐటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. సందీప్ సివిల్స్‌లో ర్యాంక్ సాధించడంపై కుటుంబీకులు, బంధువులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

కంకర లారీ బోల్తా

చెన్నూర్: పట్టణంలోని గెర్రెకాలనీలో మంగళవారం కంకర లారీ బోల్తా పడిన ఘటనలో రెండు షెడ్లు ధ్వంసం కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు చెన్నూర్ నుంచి సిరోంచకు కంకరలోడుతో అతివేగంగా వెళ్తున్న లారీ హయాన్ బార్ మూల మలుపు వద్ద బోల్తా పడడంతో పక్కనే ఉన్న రెండు చిరు వ్యాపారుల షెడ్లు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ సమ్మయ్యకు స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే వాహనం బోల్తా పడిందని, సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ దేవేందర్‌రావు సందర్శించారు.

తమ్ముడిపై కత్తితో దాడి చేసిన అన్న

నిర్మల్‌టౌన్: తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన అన్నదమ్ములు సతీశ్, యోగేశ్ అమ్మానాన్నలతో కలిసి ఉపాధి నిమిత్తం నిర్మల్‌కు వచ్చారు. కూలీపనులు చేసుకుంటూ బంగల్‌పేట్ మహాలక్ష్మి కాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి సతీశ్ మద్యం మత్తులో ఇంటికి వచ్చి తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. తమ్ముడు యోగేశ్ అడ్డు రావడంతో కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించారు. యోగేశ్ సోదరి యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

దేశీదారు పట్టివేత

ఇచ్చోడ: దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు సొనాల మండలంలోని గుర్రల తాండలో తనిఖీలు నిర్వహించగా చౌహాన్ సంజీవ్, చౌహాన్ కల్పన మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన దేశీదారు విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. 105 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది బాపురావు, కార్తీక, మౌనిక, అరుణ, మయూరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయలైన సంఘటన దనోరా(బి) గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. 108 పైలెట్ రాజేశ్, ఈఎంటీ శశికాంత్, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడకు చెందిన కోవ సూర్యభాన్ మంగళవారం ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుండి ఇంటికి వస్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

ఇంద్రవెల్లి: భర్త, అత్త వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలనీకి చెందిన శిరీష (22)ను కొంతకాలంగా భర్త జోందలే ధర్మేశ్వర్, అత్త వచ్చెలబాయి వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ నెల 21న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలు తండ్రి మునేశ్వర్ సీతారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధం



పరిశీలిస్తున్న తహసీల్దార్ తుకారాం

సిరికొండ: మండలంలోని ఫకీర్‌నాయక్ తాండలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రాథోడ్ లాల్‌సింగ్ ఇంటి పైనున్న విద్యుత్ తీగలతో షార్ట్‌సర్క్యూట్ జరిగి పశుగ్రాసానికి నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న 10 క్వింటాళ్ల జొన్నలు, బియ్యం, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. రాథోడ్‌రెడ్డి, రాథోడ్ జ్ఞానేశ్వర్ ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. తహసీల్దార్ తుకారాం, ఎస్సై శివరాం, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రాథోడ్ లాల్ సింగ్‌కు రూ.1.17 లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

కనకం.. ఇక కొనలేం..

- రూ.లక్ష దాటిన తులం బంగారం
- కొండెక్కిన గోల్డ్ ధరలు
- శుభ ఘడియల నేపథ్యంలో భారంగా బంగారం



పసిడి ధర పరుగులు పెడుతోంది. సామాన్యునికి అందనంత దూరంలో 'లక్ష'ణంగా కొండెక్కి కూర్చుంది. భారతీయ మార్కెట్ చరిత్రలోనే తొలిసారిగా తులం బంగారం లక్ష మార్కు దాటేసింది. 24 క్యారెట్ల మేలిమి బంగారం మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్లో రూ.1,01,600 ధర పలికింది. ఉదయం రూ.1,00,800 పలికిన ధర సాయంత్రానికి మరో రూ.800 పెరిగింది. గత వారం రోజులుగా సుమారుగా రూ.96 వేలు ఉన్న ధర ఏకంగా లక్షకు ఎగబాకింది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన దేశంలో శుభకార్యాల సమయంలో కనకాన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ అతివలు బంగారంపై మక్కువ ప్రదర్శిస్తుంటారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధర అధికంగా ఉన్నా తప్పదన్న ఆలోచనతో కొనాల్సిన పరిస్థితి వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కొంతన్నా కొనాల్సిందే..



తాంసి: మహిళలకు బంగారం అలంకారం కన్నా అధిక ప్రియమైంది. అందుకే కొనడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తాం. ముఖ్యంగా అక్షయ తృతీయ, దీపావళి సమయాల్లో బంగారం కొనడం శుభసూచకంగా భావిస్తారు. ధరలో తగ్గుదల ఉంటే బాగుంటుంది. అయినప్పటికీ కొంతన్నా కొనాల్సిందే.

– దారవేణి సుప్రియ, గృహిణి, తాంసి

శుభకార్యాలు భారంగా..



ఆదిలాబాద్: గతేడాదితో పోలిస్తే ఈఏడాది బంగారం ధరలు భారీగా పెరిగాయి. పెళ్లి వేడుకల్లో బంగారాన్ని కానుకగా ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. ధరలు ఇలా పెరిగితే సామాన్యులకు కష్టమే. పెళ్లి సమయంలో బంగారం ధరలు ఎక్కువగా ఉంటే శుభకార్యాలు సైతం భారంగా మారుతాయి.

– రవళి, గృహిణి

ధర తక్కువ ఉండేది..



ఆదిలాబాద్ : మేము చిన్నగా ఉన్నప్పుడు బంగారం ధర చాలా తక్కువగా ఉండేది. తులం రూ.2 వేల నుంచి 3 వేల వరకు ధర పలికేది. ఇప్పుడు ఏకంగా లక్ష రూపాయలకు చేరడం ఆశ్చర్యంగా అనిపిస్తోంది. భవిష్యత్‌లో ఇంతకంటే ధర ఎక్కువగా పెరిగితే బంగారం కొనడం కష్టమే.

– సూరం మల్లమ్మ, కుమ్మరివాడ

మధ్యతరగతి ప్రజలకు భారం



నిర్మల్ చైన్‌గేట్: గతంలో నాకు కట్నం కింద మా బంధువులు బంగారం పెట్టారు. బదులుగా ఇప్పుడు నేను పెట్టాలంటే ఆ బంగారం రేటు మూడు రెట్లు పెరిగింది. అయినా బంధువులకు పెట్టాల్సిన వంతు మాత్రం పెట్టాల్సిందే. అప్పుడు ఉన్న రేటు ఇప్పుడు మూడింతలు పెరిగింది.

– సోనాలి, నిర్మల్

కంగుతిన్నా..



నిర్మల్ చైన్‌గేట్: ఈరోజు బంగారం కొందామని వెళ్తే షాప్ యజమాని తులానికి రూ.1,01,600 ధర ఉందని చెప్పడంతో ఒక్కసారిగా కంగుతిన్నా. 12 ఏళ్ల క్రితం 45 వేలకు తులంనర బంగారం వచ్చేది. కానీ ఇప్పుడు తులం బంగారం కొనే పరిస్థితి లేదు.

– రుక్మవ్వ, గోపాల్‌పేట్

కొనడం లేదు..



నిర్మల్ చైన్‌గేట్: మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడంతో కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. బంగారం బదులు వెండి కొనుగోలు చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ అయినా ఎక్కువ మొత్తంలో బంగారం కొనడానికి మక్కువ చూపడం లేదు. – పూదరి రాజేశ్వర్, గోల్డ్‌స్మిత్, నిర్మల్

13 తులాలకు అదనంగా..



నిర్మల్ చైన్‌గేట్: ఈనెల 10న రూ.92,200 చొప్పున 13 తులాలకు వినియోగదారుల వద్ద అడ్వాన్సుగా రూ.9 లక్షలు తీసుకున్నా. మరునాడే రూ.600 పెరిగింది. రెండు రోజుల వరకు తగ్గుతుందని ఆగాను. నాలుగు రోజుల తర్వాత తులానికి రూ.96 వేలకు చేరింది. – ఏ.ఆదిత్య, గోల్డ్‌స్మిత్, నిర్మల్

రూ.80 వేలు ఉండే..



నిర్మల్ చైన్‌గేట్: మే 9న మా బాబుకు పెళ్లి నిశ్చయమైంది. అమ్మాయికి ఆరు తులాల బంగారం వేద్దామనుకున్నాం. పెళ్లి కుదిరినప్పుడు బంగారం రేటు రూ.80 వేలు ఉండె. ఇప్పుడు రూ.లక్ష దాటింది. కొనుగోలు చేయాలంటే తడిసి మోపెడవుతోంది. – దండు శేఖర్, న్యూ వెల్మల్, నిర్మల్



సోని జువెల్లర్స్ షాపులో బంగారం కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొనేపరిస్థితి లేదు



ఆసిఫాబాద్: పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనే పరిస్థితి లేదు. భవిష్యత్‌లో బంగారం ఆభరణంలా కాకుండా ఫొటోల్లో పెట్టుకునే పరిస్థితి ఉందది. ఇంకా పెరుగుతున్నాయే తప్ప దిగడం లేదు. ఇటీవల అరతులం కొనాలనుకున్నా.. ధర తగ్గుతుందనడంతో ఆగిపోయా.

– గుర్రాల హరిప్రియ, గృహిణి, ఆసిఫాబాద్

నియంత్రణ ఉండాలి



ఆసిఫాబాద్: పెరుగుతున్న బంగారం ధరలు సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. రోజురోజుకు బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. ముఖ్యంగా వివాహాల సందర్భంగా పేదలకు బంగారం కొనాలంటే మరింత కష్టంగా మారింది. బంగారం ధరలపై నియంత్రణ ఉండాలి.– కాచం వినేశ్, వ్యాపారి, ఆసిఫాబాద్

కొనలేని పరిస్థితి



మంచిర్యాలటౌన్: ఈ నెల 23న మా బాబు పెళ్లి ఉంది. బంగారం కొందామని వెళ్తే లక్ష రూపాయలకు చేరింది. పెళ్లికి తప్పనిసరిగా బంగారం కొనుగోలు చేయాలి కాబట్టి ధర పెరిగినా కొనుగోలు చేశాం. వేల నుంచి లక్షల్లోకి చేరిన బంగారంను సామాన్యులు కొనలేని పరిస్థితి.

– పురెల్ల సుజాత, పాతమంచిర్యాల

కొనక తప్పదు



మంచిర్యాలటౌన్: మా కూతురు పెళ్లి ఈ నెల 24న ఉంది. బంగారం తప్పనిసరి కావడంతో ధర పెరిగినా కొనడం తప్పడం లేదు. లక్షకు చేరుతుందని ఊహించలేదు. ధర పెరిగినా పెళ్లి కోసం కొనక తప్పదు.

– హబీబునీసా బేగం, మంచిర్యాల

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అనిత మండల్



భూమిక



డి. అక్షిత



ఈ. అభిలాష్

మంచిర్యాలటౌన్: ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, సెక్రెటరీ ఫణి, కోచ్‌లు ఎం.వనిత, రవికుమార్ తెలిపారు. వనపర్తిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్–14 పోటీల్లో ఉమ్మడి జిల్లా ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. సిర్పూర్(టి) టీజీ ఎంఆర్‌ఎస్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఏ. దీక్షిత, ఆసిఫాబాద్ టీజీ డబ్ల్యూఆర్‌జేసీలో ఎనిమిదో తరగతి చదువుతున్న భూమిక, కాగజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అనిత మండల్‌తో పాటు, అండర 14 బాలుర విభాగంలో ఆదిలాబాద్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అభిలాష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయుడు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన కిచక ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మావల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న గుండి మహేష్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని షీటీంకు ఫిర్యాదు అందగా మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం సదరు టీచర్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక యోగ టీచర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించగా ఆమె ఫిర్యాదుతో మరో కేసు సైతం నమోదు చేసినట్లు తెలిపారు.

'ట్రినిటి' జయకేతనం



ట్రినిటి కళాశాల టాపర్స్‌తో అధినేత మనోహర్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్‌లోని ట్రినిటీ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఫస్టియర్ ఎంపీసీలో జీ.మధురిమ 468 మార్కులు, సిరివైష్ణవ్య, ఉమాదేవి, వికాశ సాహి, శశాంక, లహరిక, అనూష, వైష్ణవి, అర్చన, వైష్ణవి, హారిక, శ్రీవర్ష, శ్రీజ, రిషిక, శరణ్య, ఫబిత ఐనాయత్, రశ్మిత, నేహ, నిఖిత 467 మార్కులు సాధించారు. 48 మంది 466 మార్కులు, 67 మంది 465 మార్కులు సాధించారు. బైపీసీలో పి.సహస్ర, ఎల్.హేమనందిని 438 మార్కులు, 16మంది 436, 21మంది 435మార్కులు సాధించారు. సీఈసీలో వైష్ణవి 494 మార్కులు, రాహుల్, దీపిక 490, ఎంఈసీలో భువన విజయ్ 479, శ్రావణి 467 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో వి.రశ్మిత 995 మార్కులు, అజయ్, హితేష్, బాలాజీ, సంధ్య, ప్రణతి, సాయిసంహిత 994, 13మంది 993, 21మంది 992 మార్కులు, 27 మంది 991 మార్కులు సాధించారు. బైపీసీలో డి.జ్యోత్స్న 996 మార్కులు, మహతి, పల్లవి 994 మార్కులు, నలుగురు 993, ఏడుగురు 992 మార్కులు, 12 మంది 991 మార్కులు సాధించారు. సీఈసీలో శృతి 981, ఎంఈసీలో రిషిక 980మార్కులు సాధించారు. వీరిని విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

'శ్రీ చైతన్య' విజయఢంకా



శ్రీచైతన్య టాపర్స్‌తో కరస్పాండెంట్ రమేశ్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. సెకండియర్ ఎంపీసీలో ఆర్.వైష్ణవి 993, లాస్విక 992, జీ.శ్రీనిత్య, పి.భరత్‌రెడ్డి, అకిరానందన్ 991 మార్కులు సాధించారు. బైపీసీలో అభ్యుదయ 994, ఎన్.భార్గవి 992, పి.స్ఫూర్తిశ్రీ, బి.రోహిత్ 990 మార్కులు సాధించారు. సీఈసీలో మధుమిత 961, ఎంఈసీలో ఎం.భానుప్రకాశ్ 951 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో ఎ.లక్ష్మీహాసిని 468, జీ.శ్రీహిత, పి.హాసినిరావు, ఎం.సాత్విక, జీ.శ్రీనిధి, కె.మైత్రి 467 మార్కులు సాధించారు. 466పైగా మార్కులు 22మంది, 465 పైగా మార్కులు 14 మంది సాధించారు. బైపీసీలో ఇ.అఖిల, ఔష సినివాసన్ 437, ఎస్.విష్ణు, వి.లహరి, ఆర్.అక్షయశ్రీ, సీహెచ్.కార్తీక్ 436 మార్కులు, ఎంఈసీలో ఎల్.కమలేశ్ 474, సూర మనీష 470, సీఈసీలో హారిణి 492, కె.అంజలి 491 మార్కులు సాధించారు. వీరిని విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి సత్కరించారు. డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు అరెస్ట్

జన్నారం: గంజాయి కేసులో నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం జన్నారం ఎస్సై రాజవర్ధన్ ఇందనపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 1.20 కిలోగ్రాముల గంజాయి లభించింది. జన్నారం మండలం పొనకల్ గాంధీనగర్‌కు చెందిన జునోజు రాజేశ్, సయ్యద్ సమీర్, ఎనగందుల వినయ్ , రేండ్లగూడకు చెందిన ఆకుల బాలాజీని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరు..

మంచిర్యాలక్రైం: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయహిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న భూపెల్లి లావణ్య–లక్ష్మయ్య దంపతులు ఈ నెల 18న ఇంటికి తాళంవేసి గోదావరిఖనికి వెళ్లారు. 21న ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక గౌతమినగర్‌కు చెందిన సన్నపురాజు చంద్రకాంత్ స్కూటీపై గోదావరిఖనికి వెళ్తుండగా అతన్ని తనిఖీ చేయగా ఏడు తులాల బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. నిందితునిపై గతంలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో మూడు చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోపే నేరస్తుడిని పట్టుకున్న స్పెషల్ పార్టీ సిబ్బందిని అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

దాడి కేసులో ఇద్దరు..

జన్నారం: కొత్తపేట్ గ్రామ శివారులో ఈనెల 4న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న ఇద్దరు వ్యక్తులను వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ సెక్షన్ ప్రకారం అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న బీట్ అధికారి రుబీనా తలాత్, ఆమె భర్త అఫ్రోజ్‌ఖాన్‌లపై కవ్వాల్ గ్రామానికి చెందిన రియాజొద్దీన్, ఎజాజొద్దీన్ దాడికి పాల్పడగా అటవీశాఖ వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం కేసు నమోదైంది. అయితే అప్పటికే పోలీసులు కూడా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. మంగళవారం అటవీశాఖ అధికారి వారిని కోర్టులో హాజరుపర్చగా పైవిధంగా తీర్పునిచ్చారు.

పుస్తకనేస్తం..జీవన సర్వస్వం

- దారిచూపే దీపం..
- సాంకేతికంగా పురోగమనంలోనూ వన్నెతగ్గని పుస్తకం
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: పుస్తకమా.. పుస్తకమా.. నిన్ను చదవడంవల్ల ఉపయోగం ఏంటీ..! అంటే..'తలదించుకుని నన్ను చదువు.. జీవితంలో నిన్ను తలెత్తుకుని జీవించేలా తయారుచేస్తా' అంటుందట పాఠకుడితో.. విజేతల్ని మీ అభిరుచి ఏమిటని ప్రశ్నిస్తే ఎక్కువమంది టక్కున చెప్పే సమాధానం పుస్తక పఠనం ... జీవితంలో వెలుగులు నింపే గొప్ప అస్త్రం పుస్తకం. ఎంత చదివితే అంత విజ్ఞానవంతుల్ని చేయగలిగే ఏకైక శక్తి పుస్తకానికే ఉంది. మారుతున్న కాలానికనుగుణంగా ప్రస్తుతం పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు క్రమంగా తగ్గుతోంది. ఆన్‌లైన్ అభ్యసనంతో పట్టుమని పది నిమిషాలు కూడా విద్యార్థులు పుస్తకాలు చదవలేకపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో తల్లిదండ్రులు, గురువులు పిల్లలకు నేర్పించే అతిముఖ్యమైన అలవాటు పుస్తక పఠనమే. మన పిల్లల్ని కూడా పుస్తకాలతో దోస్తీ కట్టించేందుకు తగిన మార్గనిర్దేశనం చేయాల్సిన అవసరం ఉంది. పఠనం యొక్క ప్రాముఖ్యత గురించి యువ తరానికి అవగాహన కల్పించడానికి ఏటా ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు 'ప్రపంచ పుస్తక దినోత్సవం' సందర్భంగా కథనం.




నిర్మల్‌కు చెందిన వీరు ఇరువురు మంచి స్నేహితులు. వెల్మల మధు డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా, మహమ్మద్ నజీర్‌ఖాన్ డిప్యూటీ అటవీ క్షేత్ర అధికారిగా పనిచేస్తున్నారు. వీరిద్దరి అభిరుచి పుస్తక పఠనం. ఇద్దరి మనస్తత్వాలు ఒకటే కావడంతో వృక్షశాస్త్ర రంగంలో అనేక పరిశోధనలు చేస్తున్నారు. వివిధ రకాల ప్రాంతాల్లోని పుస్తకాలను సేకరించి వాటిలో తమకు నచ్చిన అంశాలపై అధ్యయనం చేస్తారు. నచ్చిన పుస్తకాలను సేకరిస్తూ ఇంట్లోనే ఓ చిన్నపాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ప్రయోజనాలివే..

- ఒంటరితనం పారద్రోలి మంచి స్నేహితులుగా వ్యవహరిస్తాయి.
- ఏకాగ్రత పెరుగుతుంది. విషయాన్ని శ్రద్ధగా చదవడం అలవాటవుతుంది.
- పద సంపద వృద్ధిచెంది భాషపై పట్టు పెరుగుతుంది.
- భావ వ్యక్తీకరణకు దోహదం చేస్తుంది.
- ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. లోకజ్ఞానం రెట్టింపవుతుంది.
- సృజనాత్మకత పెంపొందించడానికి విషయ పరిజ్ఞానం తోడ్పడుతుంది.
- విజేతల ఆత్మకథలు చదివినప్పుడు స్ఫూర్తి, ప్రేరణ పొందవచ్చు.
- పరాజితుల అనుభవాలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపిస్తాయి.
- ఒత్తిడిని తగ్గించడానికి దివ్యఔషధంగా పనిచేస్తుంది.

సరికొత్త మైత్రిబంధం పుస్తకంతోనే..



జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ టి.సంపత్ కుమార్ ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో సీనియర్ సలహాదారుగా పనిచేసి రిటైర్ అయ్యారు. సుదీర్ఘకాలంగా పుస్తకాలతోనే మైత్రిబంధం కొనసాగిస్తున్నారు. పలు నవలలు, కథల పుస్తకాలను తెలుగు, ఆంగ్లభాషల్లో రచించారు. నాలుగు దశాబ్దాలుగా పుస్తకాలనే నేస్తాలుగా భావిస్తూ జీవనం సాగిస్తున్నారు. నేటి యువతరానికి చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అభిరుచిగా రూపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని సూచిస్తున్నారు.

లక్ష్యానికి చేరువ చేస్తుంది



పిల్లలకు చిన్నప్పటినుంచే పుస్తకపఠనం అలవాటు చేయాలి. విజ్ఞానంతో పాటు మానసిక స్థిరత్వం కూడా కలుగుతుంది. టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచాలి. పుస్తక పఠనం అలవాటు చేయడం ద్వారా పెద్దయ్యాక ఈ అభిరుచి తాము ఎంచుకున్న లక్ష్యాలకు చేరువ చేస్తుంది. – పోలీస్ భీమేశ్, కవి, రచయిత, అనంతపేట్, నిర్మల్

ఇంట్లోనే గ్రంథాలయం



పుస్తకాలు చదవడం చిన్నప్పటి నుండే అభిరుచిగా మారింది. ఎక్కడ కొత్త పుస్తకం కనపడినా వెంటనే కొనేయడం అలవాటైంది. మిత్రులు, సాహితీవేత్తలు కానుకగా ఇచ్చిన పుస్తకాలతో ఇంట్లోనే ఓ చిన్నపాటి గ్రంథాలయం ఏర్పాటైంది. ఏ కాస్త సమయం దొరికినా పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తుంటా. పుస్తకాలు చదవడం వల్ల మానసిక ప్రశాంతత దొరుకుతుంది.

– అంబటి నారాయణ, సాహితీవేత్త, నిర్మల్

అంబేడ్కర్ విగ్రహానికి అధ్యాపకుల వినతి

బాసర: ఆర్జీయూకేటీ ఒప్పంద అధ్యాపకుల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలకు సంబంధించిన జీవో 21 ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రశాంతి, రజిత, శ్రీకాంత్, విజయకుమార్, ప్రభాకర్‌రావు, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

గుడిహత్నూర్: మండలంలోని సీతాగొంది జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన డొంగరి అడెల్లు (70) బోథ్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లి తిరుగుప్రయాణంలో వాఘాపూర్ సమీపంలోని లక్ష్మీపూర్‌లో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లడానికి బస్సులో వచ్చి జాతీయ రహదారి దాటుతుండగా గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు అతివేగంతో వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కత్తితో దాడి

నిర్మల్‌టౌన్: ఇద్దరు చికెన్ షాపుల నిర్వాహకులు కత్తులతో దాడి చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన అబ్దుల్, వజిద్ ఖురేషీకు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా చికెన్‌షాపులు ఉన్నాయి. మంగళవారం వజీర్ తన దుకాణంలో యాసిడ్‌తో కడుగుతుండగా అబ్దుల్ కళ్లు మండుతున్నాయని, వాసన వస్తుందని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో వజీర్, గఫర్, షాప్‌లో పనిచేసే హుస్సేన్ అబ్దుల్‌పై కత్తితో దాడికి దిగడంతో గాయాలయ్యాయి. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాలుడిపై కుక్కలదాడి



గాయపడిన బాలుడు

కడెం: మండల కేంద్రానికి చెందిన గుంటుకు భూమేశ్ అనే బాలుడిపై ఈ నెల 21న రాత్రి ఊరకుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.